
రంజాన్ వేళలు
ఇఫ్తార్: శుక్రవారం సా: 6.35 గం.
సహర్: శనివారం ఉ: 4:44 గం.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5


సిద్దిపేట

శుక్రవారం 5 ఏప్రిల్ 2024

సంగారెడ్డి సాయిబాబా గుడిలో

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి: షిరిడీ సాయిబాబా అందరి దేవుడని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కొనియాడారు. సంగారెడ్డిలోని బైపాస్ సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వమత సమతుల్యాన్ని షిర్డి సాయి సూచిస్తున్నాయని అన్నారు. సాయి బాబా బోధనల మేరకు ప్రజలందరూ కలిసి కట్టుగా ఉండాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు.





సంగారెడ్డిలోని సాయిబాబా ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

వేలూరులో దొంగల బీభత్సం

- తాళం వేసిన ఎనిమిది ఇళ్లలో చోరీ
- 27 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 8.62లక్షల నగదు అపహరణ

వర్గల్, ఏప్రిల్ 4 : వర్గల్ మండలం వేలూరులో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన 8 ఇళ్లలో చోరీకి పాల్పడి 27 తులాల బంగారు ఆభరణాలు, 30తులాల వెండి, రూ.8.62లక్షల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకోగా.. గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలూరులోని కుమ్మరి వేణు, చిలుముల నవీన్, గడ్డం లక్ష్మణ్, కటిక పెంటయ్య కటికే భాగ్యమ్మ, మల్యాల దశరథ, కటికే చంద్రయ్య, కటిక మల్లేశం వేర్వేరు పనుల మీద బుధవారం ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. అదేరోజు రాత్రి ఆ ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మరునాడు స్థానికులు, బాధితులు గమనించి విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు



గజ్వేల్‌లో గ్రూప్స్ ఫౌండేషన్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్

పుస్తకాలే లోకంగా భావించాలి

- అప్పుడే పోటీపరీక్షల్లో విజయం తథ్యం
- సోషల్‌మీడియాను పూర్తిగా దూరం పెట్టాలి
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

గజ్వేల్/ సిద్దిపేట అగ్రికల్చర్ ఏప్రిల్ 4 : పుస్తకాలే లోకంగా భావిస్తే పోటీ పరీక్షల్లో విజయం తథ్యమని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పేర్కొన్నారు. గజ్వేల్‌లోని పోలీస్‌స్టేషన్ పక్కన గల భవనంలో తెలంగాణ ప్రభుత్వం-షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్- 1, 2, 3 తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన మూడునెలల ఫౌండేషన్ కోర్సుల ఉచిత శిక్షణ శిబిరాన్ని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ కవితతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ శ్రీకాంత్ స్టడీ సర్కిల్ గురించి కలెక్టర్‌కు వివరించారు. శిక్షణ తీసుకునే అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడి, తన సివిల్స్ అనుభవాలను పంచుకున్నారు. పోటీ పరీక్షలు అత్యంత ముఖ్యమైనవని స్పష్టం చేశారు. సిలబస్, సెలక్టెడ్ పుస్తకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, పరీక్ష అనేదీ ఎప్పుడు సులభంగా ఉండాలని కోరుకోకూడదన్నారు. ఎంత కఠినమైన పరీక్షనైనా రాయగలిగేలా సిద్ధమవ్వాలని సూచించారు. చదువును దూరం చేసే ఎలాంటి అవరోధాల జోలికి వెళ్లకూడదని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. మూడు నెలల పాటు ఒక్క నిమిషం కూడా వృథా చేయకూడదని చెప్పారు. అలాగే నిద్రకు 7, 8 గంటలు కేటాయించాలని చెప్పారు. మొక్కుబడిగా ప్రిపేర్ అవ్వకూడదని, కసితో చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఆయన సూచించారు.

సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైనది


ఎన్నికల ప్రక్రియలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వహించే సెక్టార్ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మాస్టర్ ట్రైనర్ అధికారి అయోధ్యరెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సెక్టర్ అధికారులకు విధుల గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. ఈసీఐ గైడ్‌లైన్స్‌ను తప్పకుండా పాటించాలని చెప్పారు. అందరూ సమన్వయంతో విధులను నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, డీపీవో దేవకిదేవి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

పాఠశాలలపై

కొరవడిన పర్యవేక్షణ!



- జిల్లాలో ఎంఈవోల కొరత
- 26 మండలాలకు 8 మంది ఇన్‌చార్జులు
- అదనపు పనిభారంతో సతమతం
- విద్యార్థులకు సరిగా అందని విద్య, నాణ్యమైన భోజనం

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 4 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలన్నా, మంచి ఫలితాలు రావాలన్న బోధన ఎంత ముఖ్యమో.. పర్యవేక్షణ కూడా అంతే ముఖ్యం. కానీ సిద్దిపేట జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉండగా దానికి తోడు పర్యవేక్షణ అధికారులు కూడా కరువయ్యారు. సరైన పర్యవేక్షణ లేక కొన్నిపాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం కూడా సరిగ్గా అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 638 ప్రాథమిక పాఠశాలలు, 227 ప్రాథమికోన్నత పాఠశాలలు, 113 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే ఎక్కడా కూడా రెగ్యులర్ ఎంఈవో లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న వారికి ఒక్కొక్కరికీ 4 నుంచి 5 మండలాలకు బాధ్యతలు ఇచ్చారు. ఫలితంగా పనిభారంతో సతమతమవుతున్నారు. బోధన ఏ విధంగా సాగుతున్నది. పుస్తకాలు, దుస్తులు విద్యార్థులకు అందాయా? ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా? మధ్యాహ్న భోజనం, దరఖాస్తుల స్వీకరణ, విద్యార్థులకు పరీక్షల నిర్వహణను ఎంఈవోలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే ఒక్కొక్కరికీ అదనంగా 4, 5 మండలాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో అన్నింటిని వారు పర్యవేక్షించలేకపోతున్నారు. ఒక మండలంలో సీనియర్ పీజీహెచ్ఎం ఎంఈవోగా వ్యవహరించాలి. కానీ సర్వీస్ రూల్స్ విషయం కోర్టులో ఉండడం వల్ల ఈ ప్రక్రియ కొనసాగడం లేదు. జిల్లాలో మొత్తం 26 మండలాలు ఉండగా కేవలం 8 మంది ఎంఈవోలతో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

సర్వీస్ రూల్స్ విషయం కోర్టులో ఉన్నందున ఎంఈవో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. జిల్లాలో 26 మండలాలకు 8 మంది ఎంఈవోలు ఉన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్త పడుతున్నాం. ఏ పాఠశాలలో కూడా చిన్న సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఒక ఎంఈవో రిటైర్డ్ అయితే ఆ మండలాన్ని పక్కన ఉన్న ఎంఈవోకు ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశానుసారం నడుచుకుంటున్నాము.

- శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

పేలుడు శబ్దానికి

పాఠశాలకు బీటలు

- భయంతో 100 మంది విద్యార్థులు గైర్హాజరు

హత్నూర, ఏప్రిల్ 4: ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం జరిగిన భారీ పేలుడు తీవ్రతకు సమీపంలోని బోర్పట్ల గ్రామ ఉన్నత పాఠశాల భవనం బీటలువారింది. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. పాఠశాలలో పిల్లలు లేని సమయంలో పేలుడు సంభవించడంతో ఎవరికీ హాని జరగలేదు. దీంతో, గురువారం విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠశాల గదిలో కాకుండా చెట్ల కింద కూర్చున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు తెలిపారు. ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమకు సుమారు 200 మీటర్ల దూరంలోనే బోర్పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంటుంది. పరిశ్రమ నుంచి ఇంకా పొగ వెలువడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడానికి ముందుకురాలేదు. పాఠశాలలో మొత్తం 210 మంది విద్యార్థులుండగా.. గురువారం ఉదయం 110 మంది మాత్రమే హాజరయ్యారు. పేలుడు శబ్దం ఏడెనిమిది కిలోమీటర్ల వరకు వినిపించిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చని, ఆ సమయంలో స్కూల్ ఉంటే పేలుడు ధాటికి విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉండేదని ఉపాధ్యాయుడు భానూప్రకాశ్ పేర్కొన్నారు. పేలుడు కారణంగా బడికి పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారని చెప్పారు.

సమీపంలోని పరిశ్రమలు ధ్వంసం

ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో జరిగిన పేలుడు తీవ్రతకు సమీపంలో ఉన్న పరిశ్రమల పైకప్పు దెబ్బతిన్నది. పరిశ్రమకు సమీపంలో ఉన్న బీఎస్‌పీ కంపెనీ పరిశ్రమ పైకప్పు రేకులు పగిలి చెల్లాచెదురుగాపడ్డాయి. గదుల్లోని కిటికీలు, తలుపులు, అద్దాలు పగిలిపోయాయి. వెంటనే అప్రమత్తమైన యాజమాన్యం కార్మికులందరినీ బయటకు పంపించింది.



పేలుడు తీవ్రతకు పగిలిన రేకులు

ఆర్తనాదాలు..

అరణ్య రోదన



పరిశ్రమ వద్ద శిథిలాల నుంచి మృతదేహం బయటపడడంతో రోదిస్తున్న రమేష్ కుటుంబసభ్యులు

- ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ వద్ద హృదయవిదారక దృశ్యం
- గల్లంతైనవారి కోసం కుటుంబ సభ్యుల గాలింపు
- ఎవరిని అడగాలో.. ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచని వైనం

హత్నూర, ఏప్రిల్ 4: హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట గురువారం మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తమవారి మృతదేహాలు ఎక్కడున్నాయో తెలియక కొందరు.. గల్లంతయినవారి కోసం మరికొందరు కన్నీరుమున్నీరయ్యారు. ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం జరిగిన పేలుడు ఘటనలో పరిశ్రమ డైరెక్టర్ రవిశర్మ, సుబ్రహ్మణ్యం, దయానంద్, సురేష్‌పాల్, చాకలి విష్ణు, వడ్డేపల్లి రమేష్ మృతి చెందగా.. మరో 19 మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. అయితే మృతుల కుటుంబీకులు గురువారం పరిశ్రమ వద్దకు చేరుకొని రోదిస్తున్న తీరు వర్ణనాతీతంగా మారింది.

పనికి వెళుతున్నానని చెప్పి...



రమేష్ (ఫైల్)

హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన వడ్డేపల్లి రమేష్ (32) మృతదేహం గురువారం ఉదయం శిథిలాల కింద దొరికింది. ప్రమాదం జరిగినప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అధికారులు ప్రకటించిన మృతుల్లో ఆయన పేరు లేకపోవడంతో చికిత్స పొందుతున్నాడేమోనని ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఎక్కడా లేకపోవడంతో గురువారం ఉదయం కుటుంబ సభ్యులే పరిశ్రమలో శిథిలాల కింద వెతుకులాడగా ఆయన మృతదేహం లభించింది. ఎక్కడో బతికే ఉంటాడని ఆశపడగా మృతదేహంగా కనిపించడంతో గుండెలు పగిలేలా రోదించారు. మృతుడి భార్య రేణుక మూడు నెలల గర్భిణి. మృతుడు తండ్రి గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందాడు. ఏడాది లోపే తండ్రీ, కొడుకులు మృతి చెందడంతో మృతుడి తల్లి భారతమ్మ రోదనలు మిన్నంటాయి. కంపెనీకి వెళ్తున్నానని చెప్పి కానరాని లోకానికి వెళ్లాడంటూ బోరున విలపించారు.

ఉపాధి కోసం వచ్చి మృత్యుఒడికి..

మధ్యప్రదేశ్ రాష్ట్రం క్రియన్ ఫాలోని జిల్లా కరేరా మండల్ చిప్రి గ్రామానికి చెందిన సురేష్‌పాల్ ఇరవయ్యేళ్ల క్రితం ఉపాధి కోసం ఇక్కడికి వచ్చారు. ఆయనకు భార్య రామ్‌భక్తి పాల్, పిల్లలు శివంపాల్, మనీష్‌పాల్, వైష్ణవి ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ రెండు దశాబ్దాలుగా ఎస్‌బీ పరిశ్రమలో పనిచేస్తున్నారు. రోజూలాగే బుధవారం మధ్యాహ్నం విధులకు వెళ్లిన సురేష్‌పాల్ ప్రమాదంలో మరణించాడని తెలియడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ప్రమాదం జరిగి ఇన్ని గంటలవుతున్నా భర్త మృతదేహాన్ని కూడా చూపలేదని, ఎక్కడుందో చెప్పడం లేదని రామ్‌భక్తి పాల్ విలపించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు సహాయం చేయాలని అధికారులను వేడుకున్న తీరు కలిచివేసింది.

విధులకు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

ప్రమాదంలో మృతిచెందిన దయానంద్ చెన్నైకి చెందిన వారు. 30 ఏళ్ల క్రితం దౌల్తాబాద్‌కు వచ్చి పరిశ్రమల్లో పనిచేసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో దయానంద్ ప్రొడక్షన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. భార్య మెటిల్డా, కూతురు లారా, కుమారుడు ఆసీస్‌తో కలిసి ఉంటున్నారు. లారా బీఫార్మసీ చదువుకొని ప్రస్తుతం చెన్నైలో ట్రైనింగ్ చేస్తున్నారు. కుమారుడు ఆసీస్ ఇంటర్ చదువుతున్నాడు. మెటిల్డా దౌల్తాబాద్‌లోనే ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. దయానంద్ ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదయింది. అధికారులు కనీసం తన భర్త మృతదేహాన్ని కూడా చూపించలేదని మెటిల్డా బోరున విలపించారు.

నెల క్రితమే కవలలు.. ఇంతలోనే..



విష్ణు (ఫైల్)

పరిశ్రమ పేలుడులో మృతిచెందిన చాకలి విష్ణు(32)ది నిరుపేద కుటుంబం. హత్నూర మండలం చందాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాములమ్మ, పాండరయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు. అందరిలో చిన్నవాడైన విష్ణు వద్దే తల్లిదండ్రులు ఉంటున్నారు. గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఆయనకు నెల క్రితమే ఇద్దరు పాపలు (కవలలు) జన్మించారు. బుధవారం జరిగిన ప్రమాదంలో ఆయన మృతిచెందడంతో కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదించారు. ఇద్దరు కూతుళ్లు పుట్టారని సంతోషంగా చెప్పుకునేవాడని.. నెల రోజులైనా కాకముందే.. చిన్నారుల ఆలనాపాలన చూడకుండానే మృత్యుఒడిలోకి చేరాడని బావురుమన్నారు.

విజయవాడ నుంచి వచ్చి..

మృతుడు ప్రొడక్షన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ. మృతుడికి భార్య సుజాత, కుమారుడు నికిత్‌రామ్, కూతురు తన్విక ఉన్నారు. సంగారెడ్డి పట్టణంలో స్థిరపడ్డారు. ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో ప్రొడక్షన్ ఇన్‌చార్జి పనిచేస్తూ, ప్రతీరోజూ సంగారెడ్డి నుంచి కంపెనీకి వెళ్లివచ్చేవారు. రోజూలాగే బుధవారం కూడా విధులకు వెళ్లగా మృతదేహంగా తిరిగివచ్చాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇద్దరు పిల్లలతో తానెలా బతికేదని భార్య సుజాత రోదించిన తీరు కలిచివేసింది.

అంచలంచెలుగా ఎదిగిన రవిశర్మ

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ డైరెక్టర్ రవిశర్మ పరిశ్రమలో సంభవించిన భారీ ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా గురుజాల గ్రామానికి చెందిన రవిశర్మ అంచలంచెలుగా పరిశ్రమ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. కుటుంబంతో హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఉంటున్నారు. మృతుడి భార్య ఉషారాణి ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారు. కూతురు సాయి సుస్మిత, కుమారుడు షణ్ముఖ శ్రీకృష్ణ ఉన్నారు.

హుస్నాబాద్ మార్కెట్‌కు కరీంనగర్ పొద్దుతిరుగుడు



హుస్నాబాద్ కొనుగోలు కేంద్రానికి టిప్పర్‌లో తీసుకొచ్చిన పొద్దుతిరుగుడు బస్తాలు

హుస్నాబాద్, ఏప్రిల్ 4: హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు గింజల కొనుగోలు కేంద్రానికి గురువారం రాత్రి కరీంనగర్‌కు చెందిన టిప్పర్ రావడం అనుమానాలకు తావిస్తున్నది. ఇక్కడి కొనుగోలు కేంద్రంలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలకు చెందిన రైతుల గింజలను మాత్రమే కొనుగోలు చేయాలి. లేదంటే జిల్లా అధికారుల అనుమతితో వేరే ప్రాంతానికి చెందిన రైతులవి కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. పొద్దు తిరుగుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో క్వింటాలుకు రూ.6,070 ఉండగా కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారి అక్కడ తక్కువకు కొనుగోలు చేసి వీటిని ఇక్కడ విక్రయించడానికి పంపించినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరీంనగర్ జిల్లా కొత్తపల్లికి చెందిన ఇరువురు రైతులు అక్కడి అధికారుల సూచన మేరకు ఇక్కడ విక్రయించడానికి తీసుకురాగా జిల్లా అధికారుల ఆదేశాలుంటే తప్ప తాము కొనుగోలు చేయమని తిరస్కరించడంతో వాహనం ఇక్కడ పెట్టి వెళ్లిపోయారని కొనుగోలు సిబ్బంది తెలిపారు. రైతులు అయితే ట్రాక్టర్ లేదంటే లారీలో తీసుకొస్తారు. టిప్పర్‌లో తీసుకురావడంతో ఇవి వ్యాపారివా..? లేక రైతులవా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరోగ్య యోగం

- సిద్దిపేట నుంచి విశ్వవ్యాప్తంగా..
- ఆన్‌లైన్‌లో యోగా పాఠాలు
- పది దేశాల్లో సాధన చేస్తున్న ప్రవాస భారతీయులు
- వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్ష

7లో

కొండాపూర్ పీహెచ్‌సీని సందర్శించిన

రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్

కొండాపూర్, ఏప్రిల్ 4 : కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రి దేవిలో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో సౌకర్యాలు, వసతులు, ఆరోగ్య సేవలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. సెంటర్‌లో రోజుకు అనారోగ్యంతో ఎంతమంది వస్తుంటారు, గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సందేహాలను ఎలా నివృత్తి చేస్తారని ప్రశ్నించారు.ల్యాబ్ పరీక్షలు, టీబీ, లెప్రసీ ఉన్నయా, ఆరోగ్య మహిళా క్యాంపు నిర్వహిస్తున్నారా అని వైద్యాధికారి రేష్మఅంజుమ్ బేగంను అడిగారు. అందుబాటులో ఉండి అడిగివన్నీ హెల్త్ సెంటర్‌లో చేస్తున్న సేవలు, పలు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తునట్లు తెలపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశాడు. అయన వెంట మెడికల్ అధికారి ఖలీధహుస్సేన్, హెల్త్ సెంటర్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులలోనే

ప్రసవాలు అయ్యేలా చూడాలి

● డీపీహెచ్‌ఎన్‌వో యేసు మేరీ

మద్దూరు, ఏప్రిల్ 4 : ప్రభుత్వ ఆస్పత్రులలోనే డెలివరీలు చేయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా చూడాలని డీపీహెచ్‌ఎన్‌వో యేసు మేరీ సూచించారు. గురువారం లద్నూరు, మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు ఆస్పత్రులలో డెలివరీలు అయితే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందవన్నారు. సాధ్యమైన మేరకు నార్మల్ డెలివరీలు అయ్యే విధంగా చూడాలని సూచించారు. వారి వెంట వైద్యాధికారులు స్టువర్ట్‌సన్, రజిత, సీహెచ్‌వో మాణిక్యమ్మ, యూడీసీ సుదయ్య సూపర్‌వైజర్ రోసిలిన్, ఏఎన్ఎం, ఆశాలు ఉన్నారు.

ఎన్నికల బరిలో భవన నిర్మాణ రంగ కార్మికుడు

● కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం
● బీఎన్ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4 : పద్నాలుగు రంగాల కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ అభ్యర్థిగా భవన నిర్మాణ రంగ కార్మికుడిని నిలబెడుతున్నామని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం(బీఎన్ఆర్‌కేఎస్) జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ముదిరాజ్ తెలిపారు. కార్మిక రంగా సమస్యలను పరిష్కరించడంలో అన్ని ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన మండిపడ్డారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో అయన మాట్లాడారు. కార్మికులంటే అన్ని ప్రభుత్వాలకు చులకన అయిపోయిందని, కార్మికులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. భవన నిర్మాణ రంగ కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఎన్నికల బరిలో నిలబడుతున్నామన్నారు. కార్మికులు పనిచేసే చోట ప్రమాదానికి గురైతే కనీస వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 14 రంగాల కార్మికులు ఏకమై భవన నిర్మాణ కార్మిక సంఘం తరఫున బరిలో నిలిపిన అభ్యర్థికి మద్దతు తెలిపి ఓటు ద్వారా సత్తా చాటాలని కోరారు. ఈ సమావేశంలో సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు ఐరేని ముకుందం, నాయకులు చంద్రం కనకయ్య, మల్లేశం జక్కుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సాయివెల్దికుంట శిఖం ఆక్రమణపై డీఈ పరిశీలన

మద్దూరు, ఏప్రిల్ 4 : మండల పరిధి మర్మాముల గ్రామ శివారులోని సాయివెల్ది కుంట శిఖంలో రోడ్డేసి భూ ఆక్రమణకు పాల్పడ్డట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ డీఈ శ్యాం గురువారం సందర్శించారు. గ్రామానికి చెందిన ఇప్ప నిశికాంత్‌రెడ్డి గజ్వేల్ ఈఈ కార్యాలయంలో చేసిన ఫిర్యాదు మేరకు పరిశీలనకు వచ్చినట్లు డీఈ తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా లేదా అనేది స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పూర్తి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. సర్వే నం.75లో గల సాయివెల్దికుంట ఎ.9.32 గుంటల విస్తీర్ణంతో ఉందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కుంట శిఖంలో బాట వేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు త్వరలో రెవెన్యూ అధికారులతో కలిసి పూర్తి విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సుందరగిరి సత్యనారాయణ, వెల్ది గోపాల్‌రెడ్డి, శీలం సిద్ధయ్యతో పాటు పలువురు ఉన్నారు.

కారును నమ్మే పరిస్థితులు ల్లేవ్


మాట్లాడుతున్న ఎలక్షన్‌రెడ్డి

- మాజీ సీఎం కుమార్తె జైలుకు వెళ్లారు..
- ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటన

మనోహరాబాద్, ఏప్రిల్ 4: మాజీ సీఎం కుమార్తే జైలుకు పోయింది. తెలంగాణలో కారును నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి చెందిన ఆయన.. కేసీఆర్ విజయం కోసం పలుమార్లు పని చేశారు. త్వరలోనే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. తాజాగా గురువారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కారు సర్వీసింగ్‌కు కాదు.. చివరి దశకు చేరిందని అన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ వారు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో పనులు చేసిన సర్పంచ్‌లకు బిల్లులు ఇప్పటి వరకు ఇవ్వలేదని, మాజీ సర్పంచ్‌లందరి పక్షాన నిలబడుతానని అన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి


ముత్తంగి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

పటాన్‌చెరు, ఏప్రిల్ 4 : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి తగిన చ్యలు తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. గురువారం ముత్తంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యుడిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న మందులపై ఆరా తీశారు. అనంతరం పాటి గ్రామపంచాయతీని సందర్శించి సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై పంచాయతీ ప్రత్యేక అధికారి, సెక్రెటరీని అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడిపై వచ్చే ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన 08455276155 నంబర్‌ను పంచాయతీల్లో ప్రదర్శించాలన్నారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 4: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్(ఏపీవో)లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ అధికారులు ఈవీఎం యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్‌పోలింగ్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల కనెక్షన్లు, వాటి పనితీరు, మరమ్మతు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలన్నారు. శిక్షణలో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. తొలి విడతలో 488 మంది పీవో, ఏపీవోలు శిక్షణ పొందారని, రెండో విడత ఈనెల 6న ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి రాజిరెడ్డి, అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

నర్సాపూర్, ఏప్రిల్ 4: పోలింగు కేంద్రాలలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగంచుకునేటట్టు చూడాల్సిన బాధ్యత పీవో, ఏపీవోలదే మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజా తెలిపారు. గురువారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్లమెంటు ఎన్నికల నిర్వాహణలో పీవో, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. మాక్ పోలింగులో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలని, వేసిన ఓట్లు వీవీప్యాట్‌లోని స్లిప్‌లతో సరిచూసిన తర్వాత ఈవీఎం యంత్రాన్ని క్లియర్ చేసి అనంతరం నిర్దేశించిన పోలింగు ప్రక్రియ ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


కమనీయం.. వీరభద్రుడి కల్యాణం


బొంతపల్లి వీరన్నగూడెం భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


అగ్నిగుండాలను తొక్కుతున్న భక్తులు

- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఈవో
- వైభవంగా అగ్నిగుండాలు
- నేడు స్వామి వారి రథోత్సవం

గుమ్మడిదల, ఏప్రిల్ 4 : సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వీరన్నగూడెం భద్రకాళీ సహిత వీరభద్రస్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఆవరణలో సర్వాంగసుందరంగా అలంకరించిన కల్యాణమండపంలో వీరభద్రుడు, భద్రకాళి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం ఈవో శశిధర్‌గుప్తా ఆలయ సంప్రదాయం ప్రకారం స్థానిక నాయకులతో కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు. ఉత్సవవిగ్రహాలకు వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య వైభవంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. భక్తులు కట్న కానుకలను సమర్పించారు. కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆలేటి నవీనా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, నాయకులు మద్ది ప్రతాప్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, గిద్దెరాజు స్థానిక నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఆలయం ఆవరణలో అగ్నిగుండాల పూజకార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున భక్తులు నిప్పులపై నడిచి మొక్కులను తీర్చుకొన్నారు. శుక్రవారం నాడు వీరభద్రస్వామి భద్రకాళీ అమ్మవారి విమాన రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.


సిద్దిపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో యోగా(ఫైల్)

ఆరోగ్య యోగం

సిద్దిపేట నుంచి విశ్వవ్యాప్తంగా..

- ఆన్‌లైన్‌లో యోగా పాఠాలు
- పది దేశాల్లో సాధన చేస్తున్న ప్రవాస భారతీయులు
- వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4 : నిత్యం బిజీగా.. ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది యోగాను ఆశ్రయిస్తున్నారు. మానసిక శారీరక ఆరోగ్యం కోసం రోజులో కొద్దిసేపు యోగాకు కేటాయిస్తున్నారు. ముఖ్యంగా కరోనా కాలంలో దేశవిదేశాల్లో యోగా అవసరం.. సాధన వల్ల చేకూరే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. ఈ క్రమంలోనే సిద్దిపేట కేంద్రంగా వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో స్థానికంగా యోగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించి.. సొసైటీ నిర్వాహకులు తోట సతీష్, సంధ్య దంపతులు క్రమంగా ఆన్‌లైన్‌లో సుమారు పది దేశాలకు చెందిన ప్రవాస భారతీయులకు ఉచితంగా శిక్షణనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అమెరికా, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లోని సుమారు 500 మందికి పైగా ఆన్‌లైన్‌లో యోగా శిక్షణలో పాల్గొంటున్నారు. కేవలం కొద్ది మందితో సొసైటీ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించగా, మాజీ మంత్రి.. ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో పట్టణంలోని అన్ని వార్డులకు యోగా సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణనివ్వడం ప్రారంభించారు. క్రమంగా ఆన్‌లైన్ వైపు మళ్లి.. అంతర్జాతీయ అభ్యాసకులతో యోగాసనాలు వేయిస్తున్నారు. అంతేస్థాయిలో ఆదరణ పెరగడంతో నిర్వాహకులు ఉత్సాహంగా యోగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

శిక్షకులుగా ఎదిగి..

సిద్దిపేట కేంద్రంగా ఏర్పాటైన వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న ఎందరో నేడు శిక్షకులుగా మారారు. హైదరాబాద్ వంటి నగరాల్లో పలువురికి శిక్షణ ఇస్తూ ఉపాధి సైతం పొందుతున్నారు. స్థానికులకే కాకుండా సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు, ప్రత్యేక సమయాల్లో వృద్ధులకు శిక్షణ ఇస్తూ మన్ననలు పొందుతున్నారు.



మూడేళ్ల నుంచి యోగా చేస్తున్నా..



మాది ఏపీలోని విజయవాడ. ప్రస్తుతం ఐర్లాండ్‌లో ఉద్యోగం చేస్తున్నా. మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో రోజూ వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిసు తనన యోగా తరగతులకు హాజరవుతున్నా. యోగాతో నాలో ఎంతో మార్పు వచ్చింది.

- శ్రీ మానేపల్లి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఐర్లాండ్

సిద్దిపేట యోగా తరగతులు ప్రత్యేకం



మాది భద్రాది కొత్తగూడెం. అమెరికాలో నివసిస్తున్నా. రెండున్నరేళ్లుగా ఆన్‌లైన్‌లో యోగా సాధన చేస్తున్నా. అమెరికాలో యోగా చేయించేవారున్నా.. సిద్దిపేటలో వ్యాస మహర్షి యోగా సొసైటీ వారు చెప్పే తరగతులు ప్రత్యేకం.

- నరేష్, యూఎస్ఏ, ఐటీ కన్సల్టెంట్

ఇతరులకు సూచిస్తున్నా..



ఎవరైనా యోగా తరగతులు హాజరు కావాలంటే వ్యాస మహర్షి యోగా సొసైటీలో నేర్చుకోవాలని సూచిస్తున్నా. మేము దాదాపు రెండు సంవత్సరాల నుంచి సాధన చేస్తున్నాం. గతంలో తీవ్రమైన వెన్ను నొప్పులు, మెడ నొప్పులుండేవి. యోగ చేయడం వల్ల పూర్తిగా తగ్గాయి.

- సరిత అల్లంపల్లి, బిజినెస్ అనలిస్ట్, ఐర్లాండ్

ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం



దశాబ్ద కాలంగా సిద్దిపేటలో యోగా శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాలు సహకరిస్తున్నాయి. అందరికీ ఆరోగ్యం, ఆనందం అందించాలన్న ఉద్దేశంతో పని చేసున్నాం. పట్టణ స్థాయి నుంచి వివిధ దేశాలకు విస్తరించడం ఆనందంగా ఉంది.

- నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షుడు, వ్యాస మహర్షి యోగ సొసైటీ

గూడెం మధుకు బెయిల్ మంజూరు

పటాన్‌చెరు, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ నాయకుడు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి గురువారం సాయంత్రం బెయిల్‌పై విడుదల అయ్యారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై 20రోజుల క్రితం ఆయన అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. సంగారెడ్డి సివిల్ కోర్టు న్యాయాధికారి తేజస్విని షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. దీంతో గురువారం సాయంత్రం జైలును నుంచి విడుదల అయి, పటాన్‌చెరులోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. చట్టాన్ని గౌరవిస్తామన్నారు.

ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి కంట్రోల్‌రూం

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఏప్రిల్ 4 : కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. జిల్లాలో 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని శుభ్రం చేయడానికి ప్యాడీక్లీనర్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు.

జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

- రూ.3 లక్షల వరకు అద్దె చెల్లించపోవడంతో యజమాని చర్య


జహీరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం వేయడంతో బయటే ఉన్న సిబ్బంది

జహీరాబాద్, ఏప్రిల్ 4 : అద్దె చెల్లించకపోవడంతో ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేయగా తాజాగా గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం పడింది. రెండేళ్లుగా సుమారు రూ.3 లక్షల వరకు అద్దె డబ్బు చెల్లించక పోవడంతో ఇంటి యజమాని తాళం వేశారు. ఇంతకుముందు మార్చి 27 నాడు కూడా ఆస్పత్రికి తాళం వేయగా ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది స్థానికంగ నెలకొన్న పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించడంతో మార్చి నెలాఖరువరకు చెల్లించేలా కృషిచేస్తామని చెప్పడంతో వెనుదిరిగి పోయాడు. అయినా ఇప్పటివరకు స్పందన రాకపోవడంతో మరోమారు తాళం వేశానని యజమాని తెలిపారు. తనకు పెండింగ్‌లో ఉన్న అద్దెను చెల్లిస్తేనే తాళం తీస్తానని ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి తేల్చిచెప్పాడు. అయితే అద్దె డబ్బు చెల్లింపు సమస్య తమ పరిధిలోనిది కాదని మరోమారు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది సాయంత్రం వరకు బయటే ఉండి వెళ్లిపోయారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు తాళం వేసి ఉన్న పరిస్థితిని గమనించి వెనుదిరిగిపోయారు.

ఇంకా తెరచుకోని తూప్రాన్ ఈఎస్ఐ డిస్పెన్సరీ

తూప్రాన్, ఏప్రిల్ 4: ఉమ్మడి జిల్లా నుంచి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె చెల్లింపును మాత్రం పట్టించుకోవడం లేదు. నాలుగేళ్లుగా అద్దె పెంపు చేయాలని యజమాని డిమాండ్ చేస్తుండటం, ఏడాది కాలంగా అద్దె ఇవ్వకపోవడంతో గతేడాది నవంబర్‌లో భవన యజమాని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేశాడు. సిబ్బంది హామీతో తాళం తీయగా, కొద్దిగా మాత్రమే అద్దె చెల్లింపు చేశారు. దాంతో విసుగు చెందిన భవన యజమాని మళ్లీ ఈనెల ఒటిన సోమవారం తాళం వేశాడు. తాళం వేసి నాలుగు రోజులు గడిచిపోతున్న అధికారుల పట్టింపు లేకుండా పోయింది. ప్రతి రోజు సిబ్బంది వస్తు పోతున్నారే తప్ప ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళాలు తీయించే ప్రయత్నాలు చేయడంలేదు. రోజు సుమారు 70 మంది వరకు ఓపీ రోగులు వస్తుంటారు. వీటికి తోడు వైద్యుడితో సెలవుల తదితర వాటికి రిపోర్టులు సంతకాలు అవసరముండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు లేకపోవడంతో దీర్ఘకాలిక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఎండుతున్న పంటలు.. రైతుల విలవిల


ఇంద్రకరణ్ శివారులో ఎండిన వరి పంట

- ఇంద్రకరణ్‌లో ట్యాంకర్‌ల కారణంగా పడిపోయిన నీటి నిల్వలు
- కందిలో కిసాన్‌సాగర్ తూము పనిచేయక ఎండిపోతున్న వరిపొలం
- కట్టు కాల్వలను మూసేసిన దాబాల యజమానులు

కంది, ఏప్రిల్ 4 : చేతికొచ్చిన పంట చేను ఎండపోవడం చూసి రైతన్నలు విలవిలలాడుతున్నారు. కంది మండలంలో ఓవైపు ట్యాంకర్ల కారణంగా భూగర్భ జలాలు అడుగంటుతుంటే, మరోవైపు కిసాన్‌సాగర్ చెరువు తూము గేటుపాడవడంతో నీరందక పొలాలు ఎండిపోతున్నాయి.

నీటి ట్యాంకర్ల కట్టడేదీ?

మండల పరిధిలోని చేర్యాల, ఇంద్రకరణ్, కాశీపూర్ గ్రామాల్లో రైతుల పంట పొలాల వద్ద నీటి దళారులు ట్యాంకర్‌ల ద్వారా వ్యాపారం మొదలుపెట్టారు. వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తోడుకుని పరిశ్రమలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. నీటి ట్యాంకర్ల దళారులు వారి స్వలాభం కోసం చేసే పనికి చివరికి పంటలకు నీరందని దుస్థితి నెలకొన్నది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నీటి ట్యాంకర్లను కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని తూము

కిసాన్‌సాగర్ చెరువు నిండా నీరు ఉన్నప్పటికీ చెరువు కిందకు నీటిని తరలించే తూము మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో నీరు పంటపొలాలకు రాక రైతుల బాధ వర్ణనాతీతంగా మారింది. అంతేగాక ఇతర తూముల ద్వారా వచ్చే కట్టు కాల్వలను కొందరు రియల్టర్లు, ప్లాట్ల విక్రయాల కోసం, మరికొందరు దాబా యజమానులు తమ పార్కింగ్ స్థలాల కోసం మూసివేశారు. ఈ విషయం అధికారులకు ఎన్ని పర్యాయాలు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

నష్ట పరిహారం ఇప్పించాలి



కిసాన్‌సాగర్ చెరువు కింది సాగు చేసిన ఆరు ఎకరాల వరి పంట నీరందక ఎండిపోయింది. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎండిన పంటకు నష్ట పరిహారం ఇప్పించాలి. అలాగే కిసాన్‌సాగర్ చెరువు తూము గేటును వెంటనే మరమ్మతు చేయించాలి. కట్టు కాల్వలో పూడిక తీయించాలి.

- బండి వీరారెడ్డి, రైతు, కంది

తూము గేటుకు మరమ్మతు చేయిస్తాం

కిసాన్‌సాగర్ చెరువు తూము గేటు మూసుకుపోయిన మాట వాస్తవమే. చాలా కాలంగా అది వాడుకలో లేకపోవడం వల్ల పని చేయలేదు. దీంతో కిసాన్‌సాగర్ చెరువు కింది ఆయకట్టుకు నీటి సరఫరా అందడం లేదు. వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

- మజారుద్దీన్, ఏఈ, ఇరిగేషన్

వారంలో మూడుసార్లు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్


కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న రైతులు

మనోహరాబాద్, ఏప్రిల్ 4 : మండలంలోని గౌతోజీగూడ గ్రామంలో కరెంట్ కష్టాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఇబ్బందులతో పంటలు ఎండుతున్నాయి. గ్రామంలో వారం రోజుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మూడుసార్లు కాలిపోయింది. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఎండలు దంచికొట్టడంతో పాటు, కరెంట్ సరఫరా సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని అన్నదాతలు తెలిపారు. పంట చేతికి వచ్చే సమయానికి తడులు పారించలేకపోతున్నామని తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ గుండానే గ్రామానికి నీటిని అందజేసే బోరు కనెక్షన్ ఉండటంతో వారం రోజులుగా త్రాగునీటికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నమని మాజీ సర్పంచ్ బోడ్డు వెంకటేశ్వర్లు తెలిపారు.



అక్కన్నపేట అడవిలో ఎగిసిపడుతున్న మంటలు, ఆర్పుతున్న అటవీ సిబ్బంది

అటవీ ప్రాంతంలో మంటలు

- ఆధునిక సాంకేతికతో ఆర్పిన అటవీ సిబ్బంది
- అప్పటికే ఎనిమిది ఎకరాలు దగ్ధం

రామాయంపేట, ఏప్రిల్ 4 : మెదక్ జిల్లా అక్కన్నపేట అటవీ ప్రాంతంలో మంటలు ఒక్కసారిగా మంటలు ఎగసి పడి అడవి దగ్ధమైంది. గురువారం చిన్నగా చెలరేగిన మంటలు అడవి అంతా అంటుకోగా.. అటవీశాఖ అధికారులు హుటాహుటిన వచ్చి.. నూతన సాంకేతిక విధానంతో ఫైర్ సిబ్బంది సహాయం లేకుండానే మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే సుమారు ఎనిమిది ఎకరాల్లో అటవీ ప్రాంతం దగ్ధమైనట్లు తెలుస్తోంది. అటుగా వెళ్లిన వారు బీడీ, సిగరెట్ కాల్చుకునే తరుణంలో అగ్గిపుల్ల పడేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మంటలు చెలరేగాయని భావిస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో కోత ఉండదు

● విద్యుత్ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 4: వేసవి కాలంలో నాణ్యమైన, కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని విద్యుత్ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా విద్యుత్ భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసినన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం మార్చి నెలతో పోలిస్తే ఈసారి 9.44శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. విద్యుత్ శాఖ రాష్ట్ర అధికారుల ఆదేశం మేరకు విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా విద్యుత్ సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటున్నారన్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలిటీలలో రాత్రి వేళల్లో కొంతమంది సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించినట్లు చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా కూడా ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం కలిగితే సంబంధిత డివిజన్ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లకి సమాచారం ఇవ్వాలని కోరారు. సిద్దిపేట 8333924847, గజ్వేల్ 9490492078, హుస్నాబాద్ 7901679075, సిద్దిపేట జిల్లా కంట్రోల్ రూమ్ 7382943931 ఫోన్ నంబర్లు వెల్లడించారు.

మల్లన్నా.. మినీ ట్యాంక్‌బండ్ పూర్తయ్యేనా!

● ఏడేళ్లు గడిచినా పూర్తికాని పనులు

చేర్యాల, ఏప్రిల్ 4: కొమురవెల్లి మల్లన్న చెరువు మినీట్యాంక్ బండ్ నిర్మాణ పనులు నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏడాదిలోగా అందుబాటులోకి తీసుకువస్తామని ప్రజాప్రతినిధులు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు సుమారు ఆరేళ్లక్రితం ప్రకటించినా, అవి నీటి మీద రాతలుగా మిగిలిపోయాయి. కాంట్రాక్టర్ అర్థాంతరంగా పనులు నిలిపివేయడంతో ఈ దుస్థితి దాపరించింది.



కోతకు గురవుతున్న చెరువు కట్ట

అలా మొదలై..

నీటిపారుదలశాఖ పరిధిలో ఉన్న చెరువు విస్తీర్ణం 450 మీటర్లు పొడవు, 0.02ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో 127ఎకరాలు ఆయకట్టు కలిగి ఉంది. ఏటా మూడునెలలపాటు కొనసాగే జాతరలో లక్షలాదిమంది భక్తులు తరలివస్తుండడం, సాధారణ రోజులలోనూ వచ్చే భక్తులు, పర్యాటకుల కోసం మినీట్యాంక్‌బండ్‌గా సుందరీకరించడం, అధునాతన పార్కు ఏర్పాటుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవ చూపి 2016లో సుమారు రూ.3కోట్లు నిధులు మంజూరు చేయించారు. తద్వారా రూ.2.37కోట్లతో ఎ.వీ.రాంబాబు ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ టెండర్ దక్కించుకుని పనులు ప్రారంభించింది. చెరువులో మట్టిని తొలగించి కట్ట విస్తరణ చేసి రెవిట్‌మెంట్, ఇతరత్రా పనులు చేశారు. ఇంకా కొంతమేర పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, బిల్లులు రాలేదన్న కారణంతో అర్థాంతరంగా పనులు నిలిపివేశారు. దీంతో అగ్రిమెంట్ గడువు ముగియడంతో నిర్వహణ లేక పలు ప్రదేశాలలో చెరువు కోతకు గురై అస్తవ్యస్తంగా మారింది. మల్లన్న భక్తులు స్నానమాచరించేందుకు ఏటా తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలతో చెరువును నింపుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరితగతిన ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేయించాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.

మళ్లీ అనుమతి వస్తేనే పనులు ..

మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 63శాతం పనులు చేశారు. అందుకు రూ.1.51కోట్లు చెల్లించం. అగ్రిమెంట్ గడువు పూర్తవడంతో ఒకసారి పొడిగించాం. మరోసారి అనుమతి కోసం ఉన్నతాధికారులకు పంపించాం. అనుమతి వస్తేనే పనుల ప్రారంభానికి అవకాశం ఉంటుంది.

- ఐబీ ఏఈ విష్ణు

పాత కక్షతో వ్యక్తిపై కత్తితో దాడి

కొండపాక, ఏప్రిల్ 4 : పాత కక్షలతో ఒకరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన కొండపాకలో గురువారం చోటుచేసుకున్నది. కొండపాక గ్రామానికి చెందిన వడ్డెర రేపాక చందు అనే వ్యక్తి కాలకృత్యాల తీర్చుకోవడం కోసం వడ్డెర కాలనీ వెనకాల ఉన్న చెరువు వద్దకు వెళ్తున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన రేపాక నవీన్, రేపాక సంతోష్‌లు ఇద్దరు కలిసి అతనిపై కత్తులతో దాడి చేసి గాయపరిచారు. వెంటనే విషయాన్ని చందు ఫోన్ ద్వారా తన తమ్ముడు నరేందర్‌కు చెప్పాడు. వెంటనే నరేందర్ అక్కడికి చేరుకుని చందును, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. రేపాక నవీన్, సంతోష్‌లు పాత కక్షలు మనసులో పెట్టుకోవడంతోపాటు రేపాక చందు నవీన్ వదినతో మాట్లాడినాడు అన్న అనుమానంతోనే వారు అతన్ని చంపడానికి ప్రయత్నించారు. నరేందర్ ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి ఎస్ఐ హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

బెజ్జంకి, ఏప్రిల్ 4: తేనెటీగల దాడిలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని కొత్తపల్లి సత్యసాయి పాఠశాల సమీపంలో గురువారం జరిగింది. మండల కేంద్రానికి వెళ్తున్న వాహనదారులపై పాఠశాల సమీపంలో చెట్టు పైనున్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు, రామచంద్రంతో పాటు, పలువురు వాహనదారులకు గాయాలయ్యాయి. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారిని 108 వాహనంలో బెజ్జంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. తీవ్రంగా గాయపడ్డ వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దాడి కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 4: అక్రమంగా ఇంట్లో చొరబడి దాడి చేసిన ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష తోపాటు రూ.2000 జరిమానా జిల్లా కోర్టు విధించిందని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 2016లో సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన గ్యార చంద్రకళ, రవి దంపతులు వారి కుమార్తె రమ్య ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన గ్యార వెంకటమ్మ, గ్యార శ్రీనివాస్‌లు అక్రమంగా ఇంట్లోకి చొరబడి అసభ్య పదజాలంతో దూషిస్తూ, చెప్పులతో కొట్టారు. బాధితులు పోలీసులను ఆశ్రయించగా అప్పటి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా కోర్టులో వాదోపవాదనలను విన్న జిల్లా ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిందితులకు పై విధంగా శిక్ష విధించినట్లు ఎస్ఐ వివరించారు.

పోలీసులకు సవాల్‌గా దొంగతనాలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 4: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలను అరికట్టడానికి ఆస్కారం ఉంటుందనే భావనతోనే గ్రామస్థుల సహకారంతో ఉమ్మడి మిరుదొడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీకెమెరాలను ఏర్పాటు చేసినా మెయిన్‌టనేన్స్ లేకపోవడంతో అవి నిద్రావస్థలోకి జారుకున్నాయి. వివిధ గ్రామాల్లోని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తున్నాయి. మిరుదొడ్డి మండలంలోని అల్వాల్ గ్రామంలో వారం రోజుల క్రితం వరుసగా తాళం వేసిన ఇళ్లలో దొంగలు పడి బీభత్సం సృష్టించారు. అంతేకాకుండా రెండునెలల క్రితం కూడా అదేగ్రామంలో వరుసగా ఇళ్లలో చోరీలు జరిగాయి. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారా..?లేదా...అనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రెండురోజుల క్రితం లక్ష్మీనగర్ పెద్దమ్మదేవాలయంలో అమ్మవారి నగలు, హుండీని కూడా దొంగలు ఎత్తుకెళ్లారు.

కుంట పనులను పరిశీలించిన ఎంపీడీవో

మద్దూరు, ఏప్రిల్ 4: మండలంలోని రేబర్తి గ్రామపరిధిలో ఉన్న మొండికుంటలో చేపల పెంపకం కోసం చేపడుతున్న పనులను ఎంపీడీవో రాంమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న వేజ్ సీకర్స్‌కు వేజ్ రేట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామపంచాయతీలో తాగునీటికి సబంధించిన 7 రకాల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా మొయినుద్దీన్, సెక్రటరీ మాదవ్ జాదవ్, టీఏ వెంకటమ్మ, ఫీల్డు అసిస్టెంట్ అయిలయ్య, కూలీలు పాల్గొన్నారు.

ఎన్నికలపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన

హుస్నాబాద్, ఏప్రిల్ 4: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గురువారం హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఆర్డీవో రామ్మూర్తి అవగాహన సమావేశం నిర్వహించారు. ర్యాలీలు, సభలు నిర్వహించే ముందు అనుమతి తీసుకోవాలని, ప్రతి వాహనానికి తప్పనిసరిగ పర్మిషన్ తీసుకోవాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడి నియామకం

చేర్యాల, ఏప్రిల్ 4: ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా చేర్యాల పట్టణానికి చెందిన ఆముదాల రంజిత్‌రెడ్డి నియామకమయ్యారు. రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు నూతన కమిటీని గురువారం ప్రకటించారు. ఈసందర్భగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పోరాడతానన్నారు.

వడదెబ్బ నివారణకు చర్యలు చేపట్టాలి

● సిద్దిపేట డీఎంఆండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4: వడదెబ్బ నివారణకు చర్యలు చేపట్టాలని సిద్దిపేట డీఎంఆండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. గురువారం సిద్దిపేటలోని కలెక్టరేట్‌లోని డీఎంఆండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఫార్మసిస్టులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ బారినపడకుండా ఉండేందుకు కావలసిన ఓఆర్ఎస్, ఐవి, ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల సరఫరా, నిల్వలకు సంబంధించిన స్టాక్ అండ్ ఇష్యూ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు డిస్కార్డ్ చేయాలని, కాలం అనుకూలంగా వచ్చే వ్యాధులకు సంబంధించి ముందస్తుగా మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఆండ్‌హెచ్‌వో శ్రీనివాస్, వినోద్‌బాబ్జి, శ్రీదేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఏవో రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీరును నిరసిస్తూ ధర్నా

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4: పార్లమెంటు సీట్లలో కాంగ్రెస్ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పీ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలో అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ తీరును నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభాలో అధిక శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకుండ రేవంత్‌రెడ్డి ద్రోహం చేశారని విమర్శించారు. రెడ్డిలకు, మాల కులస్తులకు భయపడి ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసం తంటాలు పడుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పరుశరాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, అధికార ప్రతినిధి రమేష్, మహిళా సంఘం నాయకులు లతక్క, సీనియర్ నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

సునీల్‌చోప్రా ఆశయ సాధనకు పాటుపడాలి

చేర్యాల, ఏప్రిల్ 4: అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం జాతీయసహాయ కార్యదర్శి సునీల్ చోప్రా ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం చేర్యాల పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, సంఘం నాయకులు వెంకట్‌మావో, ఎల్లయ్య, గొర్రె శ్రీనివాస్, మల్కని ఎల్లయ్య, దర్శనం రమేశ్, చందు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంను గెలిపించాలి

● జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 4: ప్రజల సమస్యల పరిష్కారానికి పార్లమెంటులో గళంవిప్పే సీపీఎంను లోక్‌సభ ఎన్నికలలో గెలిపించాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. గురువారం చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు గోపాలస్వామి, రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలి'

గజ్వేల్, ఏప్రిల్ 4: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెస్ చార్జీలను రూ.75 నుంచి రూ.150లకు పెంచాలని కోరుతూ, సచివాలంలో సీఎం, డిప్యూటీ సీఎం, సంక్షేమ శాఖల సలహాదారు, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కార్యాలయాల్లో గురువారం ఆయన వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ తరపున ప్రచారం

నంగునూరు, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి కోరారు. గురువారం నంగునూరు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న సిద్దిపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న విద్యార్థి, యువత ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థి విభాగం నాయకులు బిక్షపతి నాయక్, గోవిందారం రవి, నాగిళ్ల శేఖర్ గౌడ్ ,నార్లపురం రామ్మోహన్ శ్రీనివాస్ రెడ్డి, చింటూ పాల్గొన్నారు.

రసమయి బాలకిషన్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలి

● దూందాం కళాకారుడు బోనగిరి వెంకటస్వామి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 4: మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని దూందాం కళాకారుడు బోనగిరి వెంకటస్వామి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరారు.

ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4: సిద్దిపేట ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, నిరంతరం మీ సేవలోనే ఉంటానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టంచేశారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మ ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలోనే ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించామని, దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. పట్టణంలోని గాడిచెర్లపల్లిలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి సిద్ధహోంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావును సన్మానించారు. పట్టణంలో గురువారం జరిగిన పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.



మల్యాలలో బీరప్ప కామరతికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట పట్టణంలో పెద్దమ్మ ఆలయంలో హరీశ్‌రావును సన్మానిస్తున్న ఆలయ నిర్వహకులు

ప్రజల గౌరవాన్ని ప్రతిష్ఠను పెంచాం

నారాయణరావుపేట, ఏప్రిల్ 4: సిద్దిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సిద్దిపేట ప్రజల గౌరవాన్ని ప్రతిష్ఠను పెంచామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామంలోని బీరప్ప కామరతి కల్యాణ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేటను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపామన్నారు. బీరప్పస్వామి అనుగ్రహంతో సిద్దిపేట అన్ని రంగాల్లో ఆదర్శంగా చేసుకున్నామని తెలిపారు. ఈ సంర్భంగా ఆలయ నిర్వహకులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓగ్గు బాలకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామా శాఖ అధ్యక్షుడు చంద్రం, మాజీ సర్పంచులు వజ్రవ్వ, అంజనేయులు, పర్శారాములు, గోల్ల కుర్మ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను చూస్తేనే బీఆర్ఎస్, బీజేపీలకు వణుకు

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్/కోహెడ ఏప్రిల్ 4: కాంగ్రెస్‌ను చూస్తేనే బీఆర్ఎస్, బీజేపీలకు వణుకుపుడుతున్నదని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఎద్దేవా చేశారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 6న తుక్కుగూడలో నిర్వహించనున్న జనజాతర సభకు సిద్దిపేట నియోజకవర్గ నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని ముర్షద్‌గడ్డలో కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ చాంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గంప మహేందర్, ఎస్సీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, మహిళా జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు నాయిని నరసింహారెడ్డి, సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ రియాజుద్దీన్, కలిముద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, మజార్ మాలిక్, గోపికృష్ణ, గ్యాదరి మధు, బర్మా రామచంద్రం, బిక్షపతి, రాములు, షాబుద్దీన్, వహాబ్, గయాసుద్దీన్, అజ్మత్, నరసవ్వ, రజిత, సలీం, సాయిప్రతాప్, ఇమ్రాన్‌అలీ, కనకయ్యగౌడ్, వహీద్‌ఖాన్, సికిందర్ భాష, బాబు పాల్గొన్నారు. కాంగ్రెస్ జన జాతర పేరిట ఏర్పాటు చేస్తున్న చలో తుక్కుగూడ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య పిలుపునిచ్చారు. గురువారం కోహెడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, ఎంపీటీసీ బోయిని నిర్మల జయరాజ్, బండారి శ్రీశైలం, బందెల బాలకిషన్, బండారి రవీందర్, చుంచు మల్లయ్య, మామిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

నేత్రపర్వంగా నాచగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహోత్సవాలు

వర్గల్, ఏప్రిల్ 4: మండలలోని నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో నవాహ్నిక బ్రహోత్సవాలు నేత్ర పర్వంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి లక్ష్మీనృసింహస్వామి వారికి ఆలయ వేదపండితులు గరుడవాహనోత్సవ సేవ నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో దేవతా మూర్తులైన లక్ష్మీ సమేత నృసింహస్వామి దేవతా మూర్తులకు ఆలయ వేద పండితుల వేద మంత్రోశ్చరణల మధ్యన ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో నిరాజనం, మంత్ర పుష్పం, హోమాది కార్యక్రమాలతో పాటు తదితర పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై అదిష్ఠింపజేసి నాచగిరి పూరవీదుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్యన ఊరేగింపు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం క్షేత్రం వద్ద ఏర్పాట్లు ఘనంగా చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.



గిరాయిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



లక్ష్మీనృసింహ స్వామి వారికి పెద్ద గరోడోత్సవ సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది

విద్యాధరిలో

వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శ్రవణ నక్షత్ర వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారికి లక్ష పుష్పర్చన, లక్ష తులసి అర్చనతో పాటు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కొండపాక, ఏప్రిల్ 4: కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామంలో అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన లక్ష్మీరంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు, ధ్వజస్తంభ ఏర్పాటు మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలి

● గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 4: హిందూ దేవుళ్లపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్లా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడిన మాటలు అవహేళనగా ఉన్నాయని బీజేపీ గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు ఎల్కంటి సురేశ్, మహేశ్‌లు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా హిందూ దేవుళ్లపై అవహేళనగా మాట్లాడిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ, వారు గురువారం అదనపు సీఐ ముత్యంరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జై శ్రీరామ్ నినాదం బువ్వ పెట్టదని, ఉద్యోగాలు ఇవ్వదని మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. వారితో బీజేపీ నాయకులు నాగు, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, నవీన్, ప్రవీణ్, బారు అరవింద్, శ్రీరాం కృష్ణ, ఎల ప్రకాశ్ తదితరులున్నారు.

'రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

కోహెడ/హుస్నాబాద్ టౌన్ ఏప్రిల్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రమైన కోహెడలో బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్షను గురువారం చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం నేతృత్వంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ దీక్ష చేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి నర్సయ్య గౌడ్, జాలిగం రమేష్, రామంచ రాంచంద్రరెడ్డి, కంది సత్యనారాయణరెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్‌యాదవ్, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, గాజుల వెంకటేశ్వర్లు, పెర్యాల సాగర్‌రావు, కందుకూరి రాములు, ముంజ సాగర్‌గౌడ్, పొన్నాల సాగర్, అన్నాడి మధుసూదన్‌రెడ్డి, విశ్వనాథం రాజయ్య, పొన్నాల శ్రీనివాస్, గుంటిపల్లి సుధాకర్, తదితరులున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ప్రధానిగా మోడోసారి, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ని గెలిపించాలని గురువారం హుస్నాబాద్ పట్టణంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారి ఇళ్లకు వెళ్లి బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, నాయకులు నాగార్జున, లక్ష్మయ్య, లింగారెడి, గాదాసు రాంప్రసాద్, మహేష్కర్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఉచిత ఒగ్గుడోలు శిక్షణ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 4: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చండీశ్వర ఒగ్గు కళాసేవా సమితి, మాణిక్యపురం సంయుక్తంగా నిర్వహిస్తున్న పది రోజుల ఒగ్గుడోలు శిక్షణాను కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. కన్వీనర్ ఆర్ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభ సమావేశ కార్యక్రమానికి ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ అవార్డు గ్రహీత చుక్కా రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాహిత్యం, సంగీతం నాట్యంతో కూడిన సమాహార కళ ఒగ్గుకథ అన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి యస్.మహేందర్, పరీక్షల నియంత్రణ అధికారి గోపాల సుదర్శన్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గజ్వేల్‌టౌన్/మిరుదొడ్డి/బెజ్జంకి ఏప్రిల్ 4: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళా రక్షణ చటాలు, బాల్య వివాహలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై సీఐ సైద అవగాహన కల్పించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 సైబర్ సెల్‌హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీమొద్దీన్, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్‌ల బృందం సభ్యులు శ్రీరాములు, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్‌లు శ్యామల, లావణ్య, కానిస్టేబుల్‌లు మహేశ్, రామచంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాములు అన్నారు. గురువారం మిరుదొడ్డిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరాజలింగం, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది తదితరులుపాల్గొన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ శంకర్‌రావు అన్నారు. మండలంలోని బేగంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా భద్రాచల రాములోరి తలంబ్రాలు

గజ్వేల్, ఏప్రిల్ 4: దేవాదాయశాఖ సహకారంతో టీఎస్ ఆర్టీసీ ద్వారా భద్రాచలం రాముల వారి తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మెదక్ రీజియన్ కార్గో ఏటీఎం దేవేందర్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపో పరిధిలోని టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రంలో రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సందీప్(9154298668), వీబీ జయేందర్‌రెడ్డి(7997801130) నెంబర్లకు సంప్రందించి, కల్యాణ తలంబ్రాలను బుకింగ్ చేసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

గజ్వేల్, ఏప్రిల్ 4: మండల పరిధిలోని శ్రీగిరిపల్లి, అక్కారం, సింగాటం, జాలిగామ, బంగ్లావెంకటాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గజ్వేల్ ఆర్డీవో కార్యాలయ డీఏవో ఆరీఫా, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ జయపాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం యాదగిరిలు ప్రారంభించారు.

● **బెజ్జంకి:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మప్ప, ఐకేపీ ఏపీఎం నరసయ్య అన్నారు. మండలంలోని గుగ్గిళ్ళ, బెజ్జంకి క్రాసింగ్, లక్ష్మీపూర్, చిలాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవోలు, ఐకేపీ సీసీలు, వివోఏలు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని పెద్దకోడూరు, గంగాపూర్, రామంచ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎంపీడీవో జనార్ద న్, ఏపీఎం మహిపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య , రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** మండలంలోని లింగుపల్లి, మల్లుపల్లి, లక్ష్మీనగర్ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం మిరుదొడ్డి ఎంపీడీఓ గణేష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉషా, ప్రశాంత్, యాదగిరి, ఏఈవో రేణుక, సాయి, నిర్మల, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



రామంచలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



బెజ్జంకి క్రాసింగ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

● **రాయపోల్:** మండలంలోని ఎల్కల్, వడ్డెపల్లి, రామారం, గొల్లపల్లి, కొత్తపల్లి, తిమ్మక్కపల్లి గ్రామాలలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం దుర్గాప్రసాద్ ప్రారంభించారు.

● **దౌల్తాబాద్:** మండల పరిధిలోని, సూరంపల్లి, లింగరాజ్‌పల్లి, మహ్మద్‌షాపూర్, తిర్మలాపూర్, గొడుగుపల్లి, తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం కిషన్, ఏఈవో సంతోష్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు బాల్‌రాజ్, రాజేష్, లక్ష్మణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.